# సాక్షి ఖమ్మం

గురువారం । 19 । డిసెంబర్ । 2024




**ఉత్సాహంగా క్రీడాపోటీలు**

జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు మూడో రోజుకు చేరగా వివిధ ప్రాంతాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 8లో



**పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదం**

తండ్రి ఇరుముడికి హాజరై మేనమామతో బైక్‌పై పాఠశాలకు బయలుదేరిన విద్యార్థిని లారీ రూపంలో మృత్యువు బలి తీసుకుంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
30°/ 22°

**వాతావరణం**

జిల్లాలో గురువారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత మాత్రం చలి ప్రభావం పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### క్లినికల్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు

**ఖమ్మంసహకారనగర్:** ఇంటర్మీడియట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్) ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారు ఏడాది పాటు క్లినికల్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. కొత్త వారితో పాటు గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం ఏరియా ఆస్పత్రుల్లో శిక్షణ ఉంటుందని, ఎంపికైన వారు రూ.వెయ్యి డీడీ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా ఫారం, సర్టిఫికెట్ల జిరాక్స్‌లకు రూ.10 పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్‌ను జతపరిచి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 23వ తేదీలోగా అందజేయాలని డీఐఈఓ సూచించారు.

### అందుబాటులో మామిడి మొక్కలు



నర్సరీలోని అంటుమామిడి మొక్కలు

**కూసుమంచి:** కూసుమంచి మండలం చేగొమ్మలోని ఉద్యానశాఖ నర్సరీలో అంటు మామిడి మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన అధికారి అపర్ణ తెలిపారు. బంగినపల్లి, తోతాపురి, హిమాయత్ తదితర రకాల మొక్కలు పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. రైతులు ఒక్కో మొక్కకు రూ.40 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈమేరకు ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం 89777 14104 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

**ఖమ్మంమయూరిసెంటర్:** తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళాశక్తి పథకం కింద మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిరుపేద, నిరాశ్రయులు, వితంతువు, భర్త విడాకులు ఇచ్చిన మహిళలు, అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని, తెల్ల రేషన్ కార్డు, ఆహార భద్రత కార్డు ఉన్న వారు అర్హులని తెలిపారు. కార్డు లేకపోతే ఆదాయ ధ్రువపత్రం సమర్పించాలని సూచించారు. అంతేకాక నివాసం, వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, మైనార్టీ కార్పొరేషన్ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా టైలరింగ్ నేర్చుకున్న సర్టిఫికెట్, కనీసం ఐదో తరగతి విద్యార్హత కలిగిన వారు గతంలో ఎలాంటి లబ్ధి పొందలేదని సెల్ఫ్ డిక్లరేషన్ అందజేయాలని తెలిపారు. ఈమేరకు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు ధ్రువపత్రాలను జతచేసి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని సత్యనారాయణ సూచించారు.

### రేపు ఖమ్మంలో జాబ్ మేళా

**ఖమ్మం రాపర్తినగర్:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 20న శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాలో హెటిరో నెక్స్‌టీ, ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఇందులో ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.35వేల వరకు వేతనం అందుతుందని తెలిపారు. 18 నుండి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఇంటర్, ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్ డిప్లొమా, ఎంబీఏ, పూర్తి చేసిన వారు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 81210 40350, 99660 77622 నంబర్లలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

### 26న డాక్ అదాలత్


**ఖమ్మంగాంధీచౌక్:** ఖమ్మం డివిజన్ స్థాయి డాక్ అదాలత్‌ను ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. సిబ్బందితో పాటు సేవా సమస్యలు, పెండింగ్ సమస్యలను ఇందులో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంలో డాక్ అదాలత్ నిర్వహించనుండగా సమస్యలను ఈనెల 24వ తేదీలోగా చేరేలా పంపించాలని సూచించారు. సమస్యలతో పాటు ఫోన్ నంబర్లను కూడా పంపించాలని, అదాలత్ నిర్వహించే సమయాన ఆన్‌లైన్‌లో బాధితులను కూడా చేర్చి చర్చిస్తామని తెలిపారు.

# చలితో జాగ్రత్త..

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కుర్నవల్లిలో 9 డిగ్రీల కనిష్ట స్థాయిలో నమోదు
- అప్రమత్తంగా లేకుంటే అనారోగ్యం కొనితెచ్చుకున్నట్లే..

**ఖమ్మంమయూరిసెంటర్:** జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతల్లోనూ గణనీయమైన మార్పు వస్తోంది. నిన్నామొన్నటి వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలుగా నమోదు కాగా బుధవారం తల్లాడ మండలం కుర్నవల్లిలో 9డిగ్రీలకు పడిపోయింది. దీంతో చలి కారణంగా పిల్లలు, వృద్ధులతోపాటు అన్ని వయసుల వారూ వణికిపోతున్నారు. రాత్రి వేళ బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఉదయం 9గంటల వరకు కూడా కొన్ని ప్రాంతాల్లో మంచు తెరలు వీడకపోవడంతో జనసంచారం పలుచగా ఉంటోంది. కామేపల్లిలో సోమవారం 10.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మంగళవారం 16 డిగ్రీలుగా ఉంది. ఈ నేపథ్యాన ఆరోగ్యం, ఆహారం విషయాల్లోనే కాక పంటలు, పెంపుడు జంతువుల అంశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనదారులు పాటించాల్సిన రక్షణ చర్యలపై ప్రత్యేక కథనాలు..

### చిన్నాపెద్దలు అంతా భద్రం..






డాక్టర్ జి.క్రాంతి రణదేవ్

**ఖమ్మంవన్‌టౌన్:** రోజురోజుకూ ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి చేరుతూ చలి విజృంభిస్తోంది. ఉదయం, సాయంత్రం ఇదే పరిస్థితి ఉండగా మధ్యాహ్నం సైతం చలిగాలులు వీస్తుండడంతో పిల్లలు, పెద్దవారు ఆస్తమా(ఉబ్బసం), అలెర్జిక్ రైనైటిస్, సైనసైటిస్ వంటి శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. కొందరిలో ఇది ప్రాణాంతకం కాకపోయినా తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ మేరకు వ్యాధుల లక్షణాలు, జాగ్రత్తలపై ఖమ్మంలోని దిశ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ జి.క్రాంతి రణదేవ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. చలికాలంలో ఊపిరి ఆడకపోవడం, పిల్లికూతలు, ఛాతి పట్టేయడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాగే, దగ్గు, కఫం, జలుబు, ముక్కుకారడం, కళ్లమంటలు, ముక్కులు పట్టేయడం, గొంతునొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాలతో బాధపడుతుంటారు. వీటి బారిన పడకుండా చల్లగాలికి బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. తప్పనిసరి వెళ్లాల్సి వస్తే ముఖానికి చలిగాలి తగలకుండా వస్త్రాలు కట్టుకోవడమో లేదా మాస్క్ ధరించడంతో పాటు చెవుల్లో దూది పెట్టుకోవాలి. గుండె జబ్బులు ఉన్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్న వారు చలిలో వాకింగ్ చేయొద్దు. బీపీ, షుగర్ ఉన్నవారు కూడా జాగ్రత్తలు పాటించాలి. ఎప్పుడూ గోరువెచ్చని నీటినే తాగాలి. తీసుకునే ఆహారం వేడిగా ఉండాలి. చల్లటి పానీయాలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ వంటి వాటికి జోలికెళ్లొద్దు. జలుబు చేసిన వారు వేడినీటిలో చిటికెడు ఉప్పు వేసి రోజుకు రెండు మూడుసార్లు పుక్కిలించాలి. సహజంగా దొరికే పసుపు వేడినీటిలో వేసి ఆవిరిపట్టడం వంటివి చేసినా ఫలితం ఉంటుంది. మిరియాలు, ఎండు అల్లంతో చేసిన ద్రావణాన్ని రోజులో ఒకసారైనా తాగాలి. రెండు లేదా మూడురోజులపాటు ఎవరైనా ఆయాసం, దగ్గు, కఫంతో బాధపడుతున్నట్లయితే వెంటనే సమీపంలోని శ్వాసకోశ సంబంధిత నిపుణులను సంప్రదించి వైద్యం పొందాలి.

### మేలు చేసేవే తినండి..






డాక్టర్ మీనా మురారి

**ఖమ్మంవన్‌టౌన్:** చలిగాలుల నేపథ్యాన ఏం తింటే ఏమవుతుందోనన్న ఆందోళన అందరినీ వెంటాడుతుంటుంది. ఇతర కారణాలతో అనారోగ్యం ఎదురైనా తీసుకునే ఆహారం ప్రభావమే కావొచ్చని భావిస్తుంటారు. ఈమేరకు చలి పెరుగుతున్న వేళ ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఏం తినొద్దనే అంశంపై ఖమ్మంకు చెందిన డాక్టర్ మీనా మురారి (బీడీఎస్, ఎంఐడీఏ – డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ న్యూట్రీషియన్) తెలిపిన వివరాలు... చలికాలంలో ఆకుకూరలు తినాలి. తద్వారా వాటిలోని యాంటీ ఆక్సీడెంట్లు, విటమిన్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా పాలకూరలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది తినడం వలన హిమోగ్లోబిన్ పెరుగుతుంది. చలికాలంలో నెయ్యి తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యితో రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, దగ్గు వంటి సమస్యలు దరిచేరవు. అలాగే, డ్రై ఫ్రూట్స్, నట్స్ తీసుకుంటే అందులోని ప్రొటీన్లు, ఆమైనో యాసిడ్స్ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. క్యారెట్, ఉల్లిపాయలు, బచ్చలికూర, పచ్చి బఠానీలు, ఉసిరికాయలు తినాలి. ఇవి బీటాకెరోటిన్, విటమిన్ సీ వంటి పోషకాలు కలిగి ఉంటాయి. వీటితో పాటు పప్పులు, కూరగాయలు సూప్స్‌లా చేసుకుని తీసుకోవడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. పాలల్లో పసుపు, మిరియాలు, సొంటి మరిగించి ప్రతీరోజు తాగాలి. అలా చేసిన పాలను గోల్డెన్ మిల్క్ అంటారు. వయసు మీద పడినవారు టీ, కాఫీలకు బదులు హెర్బల్ టీ, అల్లం, తులసి ఆకులతో చేసిన టీ తాగితే మంచిది. వేరుశనగలు ఉడకబెట్టి కానీ, వేయించుకుని తింటే మంచిది. అందులో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. జామకాయలో ఉండే సీ విటమిన్ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. ఇకపోతే స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండాలి. ఎప్పటికప్పుడు వేడివేడి ఆహారం తినడం మరింత మంచిది.

# ఈసారి వచ్చినట్టేనా?!

- రేషన్‌కార్డు దరఖాస్తుదారుల్లో ఆశలు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద ప్రజలు
- తాజాగా మంత్రి ఉత్తమ్ ప్రకటనతో తప్పక వస్తాయని భావన
- జిల్లాలో ఇప్పటివరకు 48,113 మంది దరఖాస్తులు



**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** రేషన్‌కార్డు కోసం నిరుపేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక కార్డు కూడా ఇవ్వకపోగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఆ ఊసెత్తడం లేదు. తాజాగా పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన దరఖాస్తుదారుల్లో ఆశలు నింపుతోంది. సంక్రాంతి తర్వాత కార్డుల జారీ ఉంటుందని ప్రకటించగా ఈసారి తప్పక కార్డులు వస్తాయని నిరుపేదలు ఆశిస్తున్నారు. కాగా, జిల్లాలో పలు దఫాలుగా 48,113 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇందులో 8,876 దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తయింది.

**ప్రామాణికం కాదంటూనే..**

ప్రభుత్వం పథకాల అమలులో రేషన్‌కార్డు ప్రామాణికం కాదని చెబుతోంది. అయినప్పటికీ ప్రతీ దరఖాస్తుకు రేషన్‌కార్డు జిరాక్స్ అడుగుతున్నారు. ఇక గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్‌కార్డులు జారీచేయకపోవడంతో అర్హులైన అనేకమంది పేదలకు ప్రభుత్వ పథకాలు దరి చేరడం లేదు. ముఖ్యమంత్రి సహాయ నిధి, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, ప్రభుత్వ కార్యాలయాల ద్వారా జారీ అయ్యే ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులకు రేషన్ కార్డులనే అడుగుతున్నారు. ఈక్రమాన సంక్రాంతి తర్వాత తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేస్తామని చేసిన మంత్రి ఉత్తమ్ ప్రకటనతో తమ కష్టాలకు చెక్ పడినట్లేనని పేదల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఉపసంఘం నివేదిక ఆధారంగా..**

రేషన్‌కార్డుల జారీపై చర్చించి విధివిధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం మంత్రులతో ఉపసంఘం వేసింది. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించి అర్హతలను ఈ కమిటీ నిర్ణయించగా అర్హతలపై దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది. రేషన్‌కార్డుల జారీ కోసం సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాజ్యసభ, లోక్‌సభ సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అర్హతలను ఉపసంఘం నిర్ణయించినట్లు చెబుతున్నారు. సంక్రాంతి తర్వాత ఎందరికి రేషన్‌కార్డులు వస్తాయి.. పాత రేషన్‌కార్డులను కూడా స్మార్ట్‌కార్డులుగా మారుస్తారా.. లేక పాతవే కొనసాగిస్తారా అనేది తేలే అవకాశముంది.

**జిల్లాలో రేషన్ షాపులు, కార్డుల వివరాలు**

| | |
|---|---|
| రేషన్ దుకాణాలు | 748 |
| అంత్యోదయ కార్డులు | 27,276 |
| ఆహార భద్రత కార్డులు | 3,83,868 |
| అన్నపూర్ణ కార్డులు | 03 |
| మొత్తం రేషన్ కార్డులు | 4,11,147 |
| లబ్ధిదారులు | 11,29,235 |
| షాపులకు కేటాయించే బియ్యం | 2,73,824 కేజీలు |
| కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు | 48,113 |
| వివిధ దశల్లో ఉన్నవి | 38,494 |
| అప్రూవ్ అయినవి | 8,876 |
| తిరస్కరించినవి | 743 |

**అనుమానాలెన్నో..**

గత పదేళ్ల నుంచి రేషన్‌కార్డుల కోసం పలువురు దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన సభల్లో మరోమారు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఏ దరఖాస్తును ప్రామాణికంగా తీసుకుంటారనేది స్పష్టంగా తెలియడం లేదు. లేకపోతే సంక్రాంతి తర్వాత మరోసారి దరఖాస్తు చేసుకోమంటారా అన్న సందేహాలు కూడా తలెత్తుతున్నాయి. మరోవైపు స్మార్ట్‌కార్డుల రూపంలో తెల్ల రేషన్‌కార్డులు ఇస్తామని చెబుతుండగా.. వీటి వల్ల ఏమేం ఉపయోగాలు ఉంటాయో తేలాల్సి ఉంది. గతంలో మాదిరిగానే ఆదాయ పరిమితి ఉంటుందా, మరింత తగ్గిస్తారా అన్న అంశంపైనా స్పష్టత రావాల్సి ఉంది.

**ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాం..**



రేషన్‌కార్డు కోసం ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసుకున్నా. మా కుటుంబంలో నేను, నా భర్త, కుమారుడు ఉన్నాం. కార్డు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందడం లేదు. ఏ పథకమైనా ముందు రేషన్ కార్డే అడుగుతున్నారు. దీంతో అన్నిచోట్లా నష్టపోతున్నాం. ఈసారైనా కార్డు వస్తుందని అనుకుంటున్నా.

– చల్లా రాజేశ్వరి, తల్లాడ

# ప్రాజెక్టులకు వేగంగా భూసేకరణ

**కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

**ఖమ్మంసహకారనగర్:** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన నేషనల్ హైవే 365 బీజీ ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్, ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్‌కు భూసేకరణ, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా కోర్టు కేసుల పరిష్కారంపై సూచనలు చేశారు. అలాగే, సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కాల్వ మిగులు భూసేకరణ పూర్తిపైనా దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, నేషనల్ హైవే పీడీ రామాంజనేయ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ హేమలత, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్**

పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఇందిరా మహిళా డెయిరీ, హాస్టళ్లలో ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించిన కలెక్టర్ మాట్లాడారు. ఇందిరా మహిళా డెయిరీ స్థాపన, పాడి పశువుల యూనిట్లకు 250మంది లబ్ధిదారులను ఎంపిక చేయడంపై అధికారులను అభినందించారు. ఇదే సమయాన మిగతా యూనిట్ల గ్రౌండింగ్‌పై సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఇందిరా మహిళా డెయిరీకి గవర్నింగ్ బాడీ ఏర్పాటుచేయాలన్నారు. అలాగే, చలికాలం నేపథ్యాన గురుకులాల విద్యార్థులకు దోమ తెరలు, దుప్పట్లు అందించడమే కాక స్నానానికి వేడి నీళ్లు అందేలా చూడాలని తెలిపారు. డీఆర్డీఓ సన్యాసయ్య, సంక్షేమ శాఖల అధికారులు కస్తాల సత్యనారాయణ, ఎన్.విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, డీఏఓ పుల్లయ్య, అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్ పాల్గొన్నారు.

**మెరుగైన సేవలు అందేలా విధులు**

ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను తనిఖీ చేసిన ఆయన ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. అలాగే, ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

**విద్యార్థుల ఆంగ్ల పరిజ్ఞానం**

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞానం పెంపొందించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. 'తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ కలెక్టివ్' ప్రతినిధులు జిల్లాలో 'వి కెన్ లెర్న్' అమలవుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో పరిశీలించాక కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 34 ప్రభుత్వ పాఠశాలల్లో 6, 7వ తరగతి విద్యార్థుల కోసం అమలుచేస్తున్న పథకం ద్వారా వారిలో పరిజ్ఞానం పెరిగేలా శ్రద్ధ వహించాలని తెలిపారు. డీఈఓ సోమశేఖరశర్మ, ఏఎంఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వ్యాపార విస్తరణ, లాభాలపై మహిళలకు అవగాహన**

ఇందిరామహిళా శక్తి పథకం ద్వారా యూనిట్లు ఏర్పాటుచేసే మహిళలకు వ్యాపార విస్తరణ, లాభార్జనపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుంటూ స్వశక్తి మహిళా సంఘాలు రూపొందించే ఉత్పత్తుల అమ్మకానికి మహిళా మార్ట్ ఏర్పాటుచేయాలన్నారు. డీఆర్డీఓ సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, అడిషనల్ డీఆర్‌డీఓ నూరుద్దీన్ పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో టెలీ మానస్, టోల్‌ఫ్రీ నంబర్ 14416, యాంటీ డ్రగ్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908పై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతపై అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులతో సమీక్షించారు. డీఐఈఓ రవిబాబు, డీఎంహెచ్ఓ కళావతిబాయి, యాంటీ డ్రగ్స్ విభాగం సీఐ రాము పాల్గొన్నారు.

# గడువులోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే..

**ఖమ్మంసహకారనగర్:** నిర్దేశిత గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అందజేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మిల్లర్లు, రెవెన్యూ, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 వానాకాలం పంట కింద 80,903 మెట్రిక్ టన్నులకు గాను 69,592 మెట్రిక్ టన్నులు, యాసంగి పంటకు సంబంధించి 14,757 మెట్రిక్ టన్నుల్లో 7,743 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందించారని తెలిపారు. రెండు సీజన్లలో కలిపి ఇంకా 18,324మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గడువులోగా అందించాలన్నారు. కాగా, నాణ్యత లేకపోతే మిల్లర్లు ధాన్యాన్ని తీసుకోవద్దని, అంతే తప్ప తీసుకున్నాక కోత విధించడానికి వీల్లేదని స్పష్టం చేశా రు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ చందన్‌కుమార్, పౌర సరఫరాల సంస్థజిల్లా మేనేజర్ జి.శ్రీలత పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

**కేంఎసీకి రూ.3.66 కోట్లు మంజూరు**

**ఖమ్మంమయూరిసెంటర్:** నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా ఊరటనిచ్చే నిర్ణయం వెలువడింది. గత నెలలో అన్‌టైడ్ గ్రాంట్స్‌ను విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా 15వ ఆర్థిక సంఘం నుంచి టైడ్ గ్రాంట్స్‌ను మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాలిటీలకు ఈ నిధులు విడుదలయ్యాయి. మున్సిపాలిటీల్లో ఈ నిధులను నీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛభారత్ పథకం పనులకు వినియోగించుకోవచ్చు. వ్యర్థాల నిర్వహణకు సైతం వెచ్చించే అవకాశముండడంతో పారిశుద్ధ్యం మెరుగుపడనుంది. కాగా, ఇందులో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు అత్యధికంగా రూ.3కోట్లకు పైగా విడుదల కాగా, మణుగూరు మున్సిపాలిటీకి మాత్రం నిధులు రాలేదు.



**నిధుల వివరాలు (రూ.ల్లో)**

| | |
|---|---|
| ఖమ్మం కార్పొరేషన్ | 3,66,03,632 |
| పాల్వంచ | 1,09,57,689 |
| కొత్తగూడెం | 1,00,16,041 |
| మధిర | 44,89,053 |
| వైరా | 43,90,295 |
| సత్తుపల్లి | 43,71,005 |
| ఇల్లెందు | 42,95,821 |

# రాష్ట్రంలో ఏడో గ్యారంటీ అమలు ఏదీ?

- మూసీ, హైడ్రాకు మేం వ్యతిరేకం కాదు..
- బీజేపీ బ్రహ్మరాక్షసి కావడంతోనే కాంగ్రెస్‌కు మద్దతు
- సీపీఎం జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, వేదికపై రాఘవులు, నాయకులు



సత్తుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో సీపీఎం శ్రేణులు

**సత్తుపల్లి:** సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందు ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని తీసుకొస్తానని చెప్పగా.. ఇప్పుడు గతంలో మాదిరిగానే సీపీఎం, తదితర పార్టీలు, సంఘాల నాయకుల అరెస్టులు యథాతథంగానే కొనసాగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు అడిగితే పోలీసులకు సమర్థింపుగా మాట్లాడడంతో అందరూ ఒకే తాను ముక్కలుగా అర్థమైందని చెప్పారు. సీపీఎం జిల్లా 22వ మహాసభలు సత్తుపల్లిలో బుధవారం మొదలయ్యాయి. తొలుత ఎర్ర చొక్కాలు ధరించిన పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం మహాసభల్లో వీరభద్రం మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన, హైడ్రాకు తమ పార్టీ వ్యతిరేకం కాకున్నా ఆ పేరుతో పేదల ఇళ్లు కూల్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అయితే, మూసీలో డ్రగ్స్ ఫ్యాక్టరీల వ్యర్థాలు కలవకుండా ఆపేవరకు ప్రక్షాళన సాధ్యం కాదని తెలిపారు.

**కాంగ్రెస్‌పై భ్రమలు లేవు..**

దేశంలో సకల సమస్యలు, కష్టాలకు చాన్నాళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీనే కారణమైనందున ఆ పార్టీపై భ్రమలేవీ లేవని వీరభద్రం తెలిపారు. బీజేపీ బ్రహ్మరాక్షసి కావడంతోనే దాన్ని అడ్డుకునేందుకే కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థించామన్నారు. కాగా, ఎన్నికల ముందు రాష్ట్ర అప్పు రూ.7 లక్షల కోట్లు ఉందని తెలిసినా ఇదేసాకుగా మహిళకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర పథకాలేవీ అమలుచేయడం లేదని విమర్శించారు. ఇక రైతుభరోసాపై ఒక్కో మంత్రి ఒక్కోరకంగా మాట్లాడుతుండడంపై గందరగోళం నెలకొందన్నారు. ఇదేకాక గ్రూప్–1 పరీక్షలు, మూసీ, దామగుండం, హైడ్రాపై చర్చ జరగకుండా సీఎం రేవంత్‌రెడ్డి, కేటీఆర్ తమ వ్యాఖ్యలతో జనం దృష్టిని మరల్చాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ తల్లిని మార్చడం, సెక్రటేరియట్‌లో విగ్రహాలు పెట్టడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇదిలాగే కొనసాగితే రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఇద్దరూ లేకుండా ప్రజలు చేస్తారన్నారు. ఇక లగచర్లలో మూడువేల ఎకరాలను ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో లాక్కుందని వీరభద్రం తెలిపారు. ఈ భూములన్నీ రెండు పంటలు పండేవనని చెప్పారు. దీంతో తాము కమ్యూనిస్టులందరినీ కలుపుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నిర్ణయం మార్చుకుందని తెలిపారు. ఈసభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు సోమయ్య, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాసరావు, విఠల్‌రావు, నాయుడు వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, రమేష్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గోమాతకు సీమంతం !



గోమాతకు సీమంతం నిర్వహిస్తున్న మహిళలు

సత్తుపల్లిటౌన్: గోమాతకు చీరె, సారె పెట్టి సీమంతం నిర్వహించిన సత్తుపల్లి వాసులు పలువురి మన్ననలు అందుకున్నారు. సత్తుపల్లి పెద్దవంతెన సమీపాన ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయం గోశాలలోని ఆవుకు స్థానిక మహిళలు, హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యాన అర్చకులు తేరాల సుబ్రమణ్యశాస్త్రి పర్యవేక్షణలో గోపూజ నిర్వహించారు. అలాగే, పసుపు, కుంకుమ రాసి పూలతో అలంకరించడమే కాక కొమ్ములకు పూలదండలు కట్టి గాజులు వేశారు. ఆపై చీర, సారె సమర్పించి పండ్లు, బెల్లం, కూరగాయలు, శనగ, కొబ్బరి చెక్కలతో ఒడి నింపి సీమంతం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల శారద, కొత్తూరు లీలా జ్యోతి, గుండు శ్రీదేవి, పెనుగొండ మోహిని, తేరాల శ్రీవాణి, కొత్తూరు శారద, అడపా లక్ష్మీ తులసీ, కంభంపాటి భార్గవి, గుండు సరోజిని, వేముల సుఖరాణి, కొత్తూరు సుతలసీ, సంధ్యారాణి, కోటేశ్వరి పాల్గొన్నారు.

### క్రీడాకారులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత



జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులతో హెచ్ఓడీ, కోచ్

కల్లూరు: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈనెల 21నుంచి జరగనున్న జాతీయ స్థాయి అండర్ –17 బాలికల ఖో–ఖో పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టు బుధవారం బయలుదేరింది. ఈ సందర్భంగా 12మంది క్రీడాకారులకు రూ.35 వేల విలువైన క్రీడాదుస్తులు, రూ.30 వేల రవాణా చార్జీలను పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున అందచేశారు. ఈమేరకు ట్రస్ట్ బాధ్యులు పొంగులేటి మాధురి, పొంగులేటి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు. కాగా, జాతీయ జట్టుకు హెచ్ఓడీగా పసుపులేటి వీరరాఘవయ్య, కోచ్‌గా చీకటి శ్రీదేవి, మేనేజర్‌గా కంద్రాతి రాధాకృష్ణ వ్యవహరిస్తారని ఖమ్మం జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి నర్సింహమూర్తి తెలిపారు.

### 19క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు స్వాధీనం



విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: అనుమతి లేకుండా విక్రయిస్తున్న మొక్కజొన్న విత్తనాలను మండల కేంద్రంలో బుధవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా విత్తనాలు అమ్ముతున్నారనే సమాచారంతో వ్యవసాయాధికారులు, పోలీసులు ఓ ఇంటిపై దాడి చేసారు. అక్కడ లైసెన్స్ లేకుండా నిల్వ చేసిన రూ.19వేల విలువైన 19 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలను సీజ్ చేశామని ఏఓ నర్సింహారావు తెలిపారు. తనిఖీల్లో ఏఈఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

### కళాశాలలో విచారణ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో పలు అంశాలపై ఇటీవల ఆరోపణలు రాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రాజు హాజరుకాగా వివిధ రకాల ఫీజులు, యూనిఫాం కోసం ఎక్కువగా వసూలు చేశారనే అంశంపై విద్యార్థులు, అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. ఈ అంశంపై ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

### ఫోన్‌పే ద్వారా రూ.71వేలు స్వాహా

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన తూము నర్సింహాపురం సైబర్ మోసానికి గురయ్యాడు. ఆయన అక్టోబర్ 18న హైదరాబాద్ వెళ్తున్న సమయంలో బస్సులో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. అతర్వాత ఆయన ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా నుంచి రూ.71,900 ఇతర ఖాతాకు బదిలీ చేశారు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన నర్సింహారావు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

### ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని గంధసిరి మున్నేరు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. మండలంలోని సువర్ణాపురం క్రాస్ వద్ద ఎస్ఐ నరేష్ ఆధ్వర్యానచేపట్టిన తనిఖీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు డ్రైవర్లు, యాజమానులు కలిపి 10మందిపై కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు.

### పామాయిల్ గెలలు



| టన్ను ధర | రూ.20,413 |
|---|---|

## వరి నార్లు, మామిడి పూతను కాపాడుకోండి




ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో నమోదవుతున్న చలి పంటలకు ప్రతికూలంగా మారుతోంది. ఇందుకు అనుగుణంగా పంటల సంరక్షణలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ సూచించారు. ప్రస్తుతం వరి యాసంగి నారుమడి సాగు చేసే ముందు రెండు గుంటల మడికి రెండు క్వింటాళ్ల సేంద్రియ ఎరువు వేయాలి. అంతేకాక ఎకరం నారుమడిలో కిలో నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను అంటే రెండు కిలోల యూరియా, రెండు కిలోల డీఏపీ, కిలో లేదా కిలోన్నర మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరిలో దున్ని వేసుకోవాలి. రాత్రి పూట నిండుగా నీరు పెట్టి .. మరుసటి రోజు చల్లబడిన నీటిని తొలగించాలి. చలి తీవ్రత పెరిగితే రాత్రి నారుమళ్లపై చువ్వలు, కర్రల సాయంతో పాలిథిన్ షీట్ కప్పాలి. భూమి నుంచి పోషకాలు తీసుకునే అవకాశం ఉండనందున పైపాటుగా 19:19:19 మిశ్రమం 5–10 గ్రా.ను నారు వయస్సు ఆధారంగా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇక పత్తి విషయంలో చలి తగ్గి ఎండ కాసే సమయాన తీసి తేమశాతం 10 వరకు వచ్చేలా అరబెట్టాలి. అలాగే, మిరప పూత నుంచి కాయ దశలో ఉన్నందున పైపాటుగా 13–0–45 లేదా 19–19–19 లాంటి పోషకాలు పిచికారీ చేయాలి. పూత రాలుతుంటే ప్లానోఫిక్స్ ఒక మి.లీ.ను 45 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయకుళ్లు తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1మి.లీ. లేదా కాప్టన్+హెక్సాకొనజోల్ రెండు గ్రా.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడి తోటల్లో పూతను కాపాడుకునేలా 10గ్రా. పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడిలో ఆకుగూడు పురుగు సమస్య పెరుగుతున్నందున క్లోరోపైరిపాస్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తీగజాతి కూరగాయల పంటల్లో పూత రక్షణకు బోరాన్ 2 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.



డాక్టర్ కె.రవికుమార్

## పశుపక్ష్యాదుల సంరక్షణ



ఖమ్మంవ్యవసాయం: చలి కారణంగా మనుషులతో పాటు పశువులు, పక్షులు అవస్థ పడుతుంటాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని యజమానులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఉన్న వనరుల ఆధారంగా పాడి పశువుల పెంపకం, కోళ్ల పరిశ్రమలు కొనసాగుతున్నాయి. పశువులు దాదాపు 5లక్షల వరకు ఉండగా, జీవాల సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక కోళ్ల పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, రఘునాథపాలెం, పెనుబల్లి, సత్తుపల్లి, కల్లూరు, మధిర, వైరా, కూసుమంచి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. చలి కారణంగా పశువులు, ఇతర జీవాల్లో వ్యాధులు సోకే ప్రమాదమున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మం పశుసంవర్ధక, పశువైద్య రోగ నిర్ధారణ కేంద్ర సహాయ సంచాలకులు డాక్టర్ అరుణ చేసిన సూచనలు ఇలా ఉన్నాయి. చలికాలంలో పశువులను ఆరుబయట కట్టేయకుండా ప్రత్యేక పాకలు ఏర్పాటు చేయాలి. కింద గడ్డితో బెడ్డింగ్ ఏర్పాటు చేస్తే వాటికి ఇబ్బంది ఉండదు. చల్లటిగాలులు సోకుండా రాత్రి సమయాన పాకల చుట్టూ పరదాలు కట్టాలి. తరచుగా గోరువెచ్చని నీరు అందించాలి. ముఖ్యంగా అప్పుడే పుట్టిన, నెలల వయసున్న దూడలు, జబ్బుతో బాధపడుతున్న పశువులు, పాలు ఇచ్చేవి, ఈనేందుకు సిద్ధంగా ఉన్న వాటి విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. సకాలంలో టీకాలు వేయించాలి. అలాగే కోళ్లను ఆరుబయట కాకుండా షెడ్లు, గూళ్లు, గంపల్లో ఉంచాలి. కొక్కెర మందు, అమ్మతల్లి టీకాలు వేయించాలి. షెడ్లలో చలి నుంచి తట్టుకోవడానికి లైట్లను ఏర్పాటు చేస్తే వేడి వాతావరణం ఉంటుంది. పెంపుడు కుక్కలను కూడా వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. పది రోజులకోసారి స్నానం చేయించాలి. ఈ జాగ్రత్తలన్నీ పాటిస్తే పశువులు, పెంపుడు జంతువులను చలి నుంచి కాపాడుకోవచ్చు.



డాక్టర్ అరుణ

# పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదం

- లారీ కింద పడి విద్యార్థిని మృతి
- తండ్రి ఇరుముడికి హాజరై వెళ్తుండగా ఘటన



హర్షశ్రీ (ఫైల్)



ఘటనా స్థలంలో రోదిస్తున్న బాలిక తల్లి, బంధువులు

వైరా: తండ్రి అయ్యప్ప దీక్ష స్వీకరించాడు.. ఇరుముడి ధరించి శబరి వెళ్లే సమయం రావడంతో గురుకులంలో ఉంటున్న కుమార్తెను తీసుకొచ్చాడు. రెండు రోజులు తండ్రితో గడిపిన ఆమె ఆయన ఇరుముడి కట్టుకుని శబరి వెళ్లిపోగా, మేనమామ బైక్‌పై పాఠశాలకు వెళ్తోంది. ఇంకో పది నిమిషాల్లో పాఠశాలకు చేరుతుందనగా బైక్ హ్యాండిల్ లారీని తాకగా అదే లారీ కింద పడిన విద్యార్థి తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. వైరాలో బుధవారం జరిగిన ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం కోయచిలకకు చెందిన చెరుకూరి వీరబాబు కుమార్తె హర్షశ్రీ(12) వైరాలోని టీఎస్ఆర్ఎస్ బాలికల గురుకులంలో ఏడో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి అయ్యప్పదీక్ష స్వీకరించగా ఈనెల 15న బాలికను ఆయన తన ఆటోలో ఇంటికి వెళ్లింది. వీరబాబు మంగళవారం ఇరుముడి ధరించి శబరి వెళ్లగా, బుధవారం మేనమామ శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై హర్షశ్రీ పాఠశాలకు వస్తోంది. కాగా, వైరా రింగ్ రోడ్డు సమీపాన ట్రాక్టర్ పక్క నుంచి వెళ్తుండగా మరోపక్క నుంచి లారీ వెళ్తోంది. ఈక్రమాన బైక్ హ్యాండిల్‌కు లారీ తాకడంతో ఎడమ పక్క శ్రీకాంత్, కుడిపక్క లారీ వెనుక టైర్ కింద హర్షశ్రీ పడడంతో 100 మీటర్ల వరకు ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈమేరకు తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే బాలిక మృతి చెందింది. ఇదే ఘటనలో శ్రీకాంత్‌కు సురక్షితంగా బయటపడ్డాడు. కాగా, బైక్ పెట్రోలు ట్యాంక్‌పై హర్షశ్రీ బట్టల బ్యాగ్ ఉండడం, లారీ అతి వేగంగా వెళ్తుండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికుల ద్వారా తెలిసింది.

**చదువులో చురుకు**

కోయచలకకు చెందిన వీరబాబు – నాగమణి దంపతులకు హర్షశ్రీ, నవ్యశ్రీ ఇద్దరు సంతానం. వీరబాబు గత కొన్నేళ్లుగా ఏటా అయ్యప్ప మాల ధరిస్తున్నాడు. ఈసారి కూడా దీక్ష స్వీకరించగా నాలుగు రోజుల ముందుగానే హర్షశ్రీని తన ఆటోలో ఇంటికి తీసుకొచ్చాడు. దీంతో తండ్రితో పాటు పూజలో పాల్గొన్న ఆమె ఆయన ఇరుముడి వేడుకలోనూ పాల్గొంది. అలాగే, బుధవారం ఇంట్లో పూజ చేసి బయలుదేరి హర్షశ్రీ గమ్యం చేరలేదు. అయితే, ఎప్పుడు పాఠశాల నుంచి వచ్చినా, తిరిగి వెళ్లాలన్నా తండ్రే తన ఆటోలో దింపేవాడు. కానీ ఈసారి తండ్రి శబరి వెళ్లడంతో బైక్‌పై బయలుదేరగా ప్రమాదం జరిగింది. కాగా, ప్రమాదం సమాచారం అందుకున్న ఆమె తల్లి నాగమణి, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. ఇంకో రోజు ఇంటి వద్ద ఉన్నా ప్రమాదం జరగకపోయేదని ఆమె రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఇక ప్రమాదం జరిగిందని తెలియడంతో నాగబాబు శబరి యాత్ర మధ్యలోనే విరమించుకుని వెనక్కి బయలుదేరాడు. ఇక హర్షశ్రీ చదివే పాఠశాల ప్రిన్సిపాల్ రమ, ఉపాధ్యాయులు కూడా చేరుకోగా ఆమె చదువులో ఎప్పుడు మొదటి స్థానంలో నిలిచేదని చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీ కృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.

**కోయచలకలో విషాదఛాయలు**

రఘునాథపాలెం: వైరాలో చదువులున్న హర్షశ్రీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందన్న సమాచారంతో ఆమె స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం కోయచలకలో విషాదం అలుముకుంది. ఉదయమే పాఠశాలకు బయలుదేరిన మృతి చెందిందని తెలియడంతో కుటుంబీకులు హుటాహుటీన బయలుదేరారు.

## సమయపాలన కచ్చితంగా పాటించాల్సిందే...



వైరా పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

రఘునాథపాలెం/కారేపల్లి/కామేపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాల్సిందేనని, ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి హెచ్చరించారు. రఘునాథపాలెం మంచుకొండతో పాటు సింగరేణి, కామేపల్లి పీహెచ్‌సీలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. కాగా, మంచుకొండ పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేసిన సమయాన వైద్యులు లేకపోవడంతో పీహెచ్‌సీలను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది నిర్దేశిత పనివేళల్లో అందుబాటులో ఉండడమే కాక ప్రభుత్వ కార్యక్రమాలను చిత్తశుద్ధి అమలుచేయాలని తెలిపారు. ఈకార్యక్రమాల్లో జిల్లా ఇమ్యూనైజేసన్ అధికారి డాక్టర్ చందునాయక్, వైద్యాధికారులు శ్రీదేవి, గోలి రమాదేవి, నెల్లూరి చందన, సిబ్బంది పాల్గొన్నారు.

## 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవ సభ

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ఖమ్మంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. సీపీఐ, ప్రజాసంఘాల సంయుక్త సమావేశం యర్రా బాబు అధ్యక్షతన బుధవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ఈనెల 26న ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా వంద మంది రెడ్ షర్ట్ వలంటీర్లు కవాతు చేయనుండగా, ఇందులో కోలాటం, డప్పు దళాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఆతర్వాత భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన సభకు సీపీఐ జాతీయ నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ మేరకు కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సురేష్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ భాగం హేమంతరావు, నాయకులు కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, పగడాల మల్లేష్, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

## వ్యక్తి మృతదేహం లభ్యం

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో పాత ఇనుప దుకాణం నిర్వహిస్తున్న షేక్ ఇబ్రహీం (55) మృతదేహం బుధవారం లభ్యమైంది. ఆయన సోమవారం గ్రామ సమీపంలోని సాగర్ ఇన్‌ఫ్లో కాల్వలో స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఈనేపథ్యాన గజ ఈతగాళ్లు గాలిస్తుండగా బుధవారం ఉదయం పాలేరు రిజర్వాయర్‌లో ఆయన మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు. కాగా, ఇబ్రహీం స్వస్థలం ఏపీలోని పెండ్యాల కాగా నాయకన్‌గూడెంలో వ్యాపారం చేస్తున్నాడు.

# ‘భూమాత’తోనే ప్రజలకు న్యాయం

వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న రెవెన్యూ చట్టం ‘భూమాత’తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు తెలిపారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ‘గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థ, వీఆర్వోల పాత్ర’ అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, వ్యవసాయ శాఖల మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చొరవతో పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం దక్కుతుందనే నమ్మకం ఉందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అటు రైతులు, ఇటు వీఆర్వోలు ఇబ్బంది పడ్డారని చెప్పారు. ప్రభుత్వ ప్రతినిధులుగా గౌరవంగా బతికిన వీఆర్వోల వ్యవస్థను నాటి ప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రంలోని 5,139 మందికి ఉద్యోగ భద్రత లేకుండా చేసిందన్నారు. ఈనేపథ్యాన ప్రస్తుత ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు విశ్వనాథం, లక్ష్మీనర్సింహులు, స్వామిదాసు, షేక్ సుబాన్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ గురుకులాలను ప్రక్షాళన చేయాలి



విద్యార్థిని కీర్తిని పరామర్శిస్తున్న సీపీఐ నాయకుడు హేమంతరావు, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలోని సంక్షేమ శాఖల గురుకులాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఖమ్మం బీసీ గురుకులంలో ఎలుకలు దాడి చేయగా చికిత్స పొందుతున్న లక్ష్మీ భవాని కీర్తిని బుధవారం ఆయన ఆస్పత్రిలో పరామర్శించి మాట్లాడారు. విద్యార్థిని 11 సార్లు ఎలుకలు కరిచినా అధికారులు పట్టించుకోకపోవడం గర్హనీయమన్నారు. ప్రభుత్వం గురుకులాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను విడనాడి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం గర్హనీయమన్నారు. ఆయన వెంట నాయకులు తాటి వెంకటేశ్వర్లు, ఇటికాల రామకృష్ణ శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**పోరాటాలే పార్టీ నిర్మాణానికి పునాదులు**

బోనకల్: సమస్యలపై చేసే ప్రజా పోరాటాలే పార్టీ నిర్మాణానికి పునాదులని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. చింతకానిలో బుధవారం జరిగిన బోనకల్, మధిర మండలాల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో మొదలుకానున్న పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, దండి సురేష్, బెజవాడ రవిబాబు, యంగల ఆనందరావు, ఆకెన పవన్, లక్ష్మణ్, నాగ కృష్ణాచారి, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, ఏనుగు రవి, జయరాజు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకే పోటీలు



విజేతలుగా నిలిచిన వారితో ఫోరం బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిలో సృజనాత్మక శక్తి పెంపొందించేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం(టీబీఎస్ఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రేపాల శ్రీనివాసరావు తెలిపారు. ఫోరం ఆధ్వర్యాన ఖమ్మంలోని సైన్స్ మ్యూజియంలో బుధవారం జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా ఎంపికైన నలుగురు చొప్పున విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా జిల్లాస్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఆయా విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవితంలో ఏది సాధించాలన్నా చదువుతోనే సాధ్యమవుతుందని విద్యార్థులు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ రాజశేఖర్, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి దుస్స జగదీశ్వర్‌తో పాటు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రంజిత్‌కుమార్, రామారావు, మాధవి, ఐలయ్య, రూబీ, అన్నపూర్ణ, నళిని, యాకూబ్ పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు



అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారితో డీవైఎస్ఓ, తదితరులు



చెస్‌పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పురుషులు, మహిళల అథ్లెటిక్స్, చెస్, షూటింగ్, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ. అక్బర్ అలీ, కైలాష్, పీడీలు ఎం.డీ.షఫీ, ఆదర్శ్‌కుమార్, నగేష్ తదితరులు బహుమతులు అందజేశారు. అన్ని క్రీడాంశాల్లో కలిపి 711 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు.

# ఫోర్జరీ సంతకాలతో రూ.1.50 లక్షలు స్వాహా

అమెరికా వెళ్లిన మహిళ పేరిట ఖాతా, నగదు డ్రా

తల్లాడ: అమెరికాలో ఉన్న మహిళ సంతకాలు ఫోర్జరీ చేసి ఖాతా తెరవడమే కాక ఆమె పేరిట అందిన చెక్కు ద్వారా రూ.1.50లక్షలు డ్రా చేసుకున్నారని తల్లాడ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి మండలంలోని కుర్నవల్లికి చెందిన వేమిరెడ్డి పద్మావతి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పద్మావతి అమెరికా వెళ్లగా అంతకు ముందే ఎల్ఐసీ పాలసీ తీసుకుంది. ఈ పాలసీ 2019లో ముగియడంతో ఆమె పేరిట రూ.1.50లక్షల చెక్కును స్వగ్రామానికి పంపించారు. ఈ విషయమై ఆమె అల్లుడు శీలం మురళీమోహన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం ఫోన్ చేసి చెప్పగా విత్ డ్రా చేసి నగదు పంపించాలని సూచించింది. కానీ తల్లాడ డీసీసీబీ బ్రాంచ్‌కు వెళ్తే పద్మావతి రావాలని సూచించారు. ఈ విషయాన్ని కుర్నవల్లి సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డికి మురళి చెప్పగా ఆయన మార్చి ఇస్తానని చెప్పి చెక్కు తీసుకుని తన సంతకం ఫోర్జరీ చేసి తల్లాడ బ్రాంచ్‌లో కొత్త ఖాతా తీసి చెక్కు జమ చేశాక నగదు విత్‌డ్రా చేశాడని పద్మావతి ఆరోపిస్తోంది. ఈ విషయాన్ని ఇటీవల అమెరికా నుంచి వచ్చిన తాను గుర్తించగా తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని వెల్లడించింది. తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు ప్రదీప్‌రెడ్డితో పాటు బ్యాంక్ సిబ్బందిని విచారణ చేస్తున్నామని తెలిపారు. ఇక ప్రదీప్‌రెడ్డిని ఈ అంశంపై మాట్లాడుతూ తనకు పిన్ని అయిన పద్మావతికి డబ్బుతో సంబంధం లేదని, ఆమె అల్లుడు మురళీమోహన్‌రెడ్డి డబ్బు డ్రా చేసినట్లుగా తల్లాడ డీసీసీబీ బ్రాంచ్‌కి రాసిచ్చినట్లు తెలిపారు.

# హత్య కేసులో ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష

మరొకరికి ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా

పెనుబల్లి: సర్పంచ్ ఎన్నికల్లో ఓటమికి కారణమయ్యాడంటూ ఓ వ్యక్తిని హత్య చేసిన ఏడుగురికి జైలుశిక్ష విధిస్తూ సత్తుపల్లి ఆరో అడిషనల్ జడ్జి ఎం.శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో పెనుబల్లి మండలం బ్రహ్మళకుంట గ్రామానికి చెందిన బానోతు తాళీ అనే ఆమె బ్రహ్మళకుంట సర్పంచ్‌గా గెలుపొందింది. అయితే, ఆమె గెలవడానికి తాము ఓడిపోవడానికి ఏటుకూరి నర్సింహారావు కారణమని తాళీ ప్రత్యర్థి అయిన బానోతు తులిసమ్మ కుమారుడు గోపి కక్ష పెంచుకున్నాడు. ఈమేరకు 2019 సెప్టెంబర్ 10న పొలం పనులకు తాళ్లపెంట వెళ్లివస్తున్న నర్సింహారావును బానోతు గోపి, ఆయన స్నేహితుడు బానోతు వెంకటేశ్వరరావు కలిసి మరణాయుధాలతో దాడి చేసి హత్యకు పాల్పడ్డారు. ఈమేరకు కేసు దర్యాప్తులో భాగంగా వీరిద్దరితో పాటు వీరికి సహకరించిన బానోతు బీమా, బానోతు మోహన్, అజ్మీరా రవీంద్ర, బానోతు కృష్ణ, వాంకుడోతు మంగమ్మపై పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో గోపి, వెంకటేశ్వరరావు, బీమా, మోహన్, రవీంద్ర, కృష్ణకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. అలాగే, కేసులో ప్రమేయం ఉన్న మంగమ్మకు ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు. ఈ కేసును అప్పటి ఇన్‌స్పెక్టర్లు టి.రవికుమార్, టి.కరుణాకర్ విచారించగా సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు, లైజన్ ఆఫీసర్ కె.శ్రీకాంత్, సిబ్బంది డి.నాగేశ్వరరావు, కె.గిరి సహకరించారని సత్తుపల్లి రూరల్ సీఐ ఎంఎల్.ముత్తిలింగయ్య గౌడ్ వెల్లడించారు.

## మూడేళ్లుగా కొనసాగుతున్న కుల బహిష్కరణ

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో మూడేళ్ల క్రితం జరిగిన ఘటనతో నాలుగు కుటుంబాలను మూడేళ్ల క్రితం సామాజిక బహిష్కరణ చేయగా ఆ నిర్ణయం ఇంకా కొనసాగుతుండడం గమనార్హం. గ్రామంలోని ఓ సామాజిక వర్గంలో సొసైటీ సభ్యత్వం విషయమై రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తొలుత నాలుగు కుటుంబాలను కుల బహిష్కరణ చేశారు. ఈ మేరకు వారి ఇళ్లకు ఎవరూ వెళ్లవద్దని తీర్మానించగా.. ఆ నాలుగు కుటుంబాల బంధువులు, వారికి దగ్గరగా ఉండే వారినీ దూరం పెడుతున్నారు. తాజాగా ఆ నాలుగు కుటుంబాలతో చనువుగా ఉన్న మరో కుటుంబం ఇంట్లో వివాహం జరగగా ఎవరూ వెళ్లలేదని తెలిసింది. మూడేళ్లగా ఈ పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## తల్లి మృతి కేసులో కుమారుడి అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వడివిజన్ ఖానాపురంలోని బొడ్రాయి సెంటర్‌కు చెందిన కొప్పెర శ్రీవాణి మృతి కేసులో ఆమె చిన్న కుమారుడు గోపీనాథ్ అరెస్ట్ చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. శ్రీవాణి తన ఇంట్లో మంగళవారం మృతి చెందగా ఇందుకు కారణం గోపి అని ఆయన తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టామని వెల్లడించారు. సెంట్రింగ్ పనులకు వెళ్లే గోపి కొన్నాళ్లుగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. గత వారం రోజుల నుండి డబ్బులు ఇవ్వాలని ఆయన తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. ఈక్రమంలోనే తల్లిని కొట్టాడు. మంగళవారం మధ్యాహ్నం కూడా ఇంట్లో తల్లి ఒక్కరే ఉన్న సమయాన మళ్లీ గొడవ చేయగా ఆమె గోపి చెంపపై కొట్టింది. దీంతో శ్రీవాణి మెడ నులిమిన ఆమె కుమారుడు హత్య చేసినట్లు గుర్తించామని సీఐ తెలిపారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న ఐదుగురితో కూడిన ముఠాను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ నెల 15న తిరుమలాయపాలెంలో ఎయిర్‌టెల్ టవర్ వద్ద పాత ఇనుము, కాపర్ వైర్ దొంగిలించేందుకు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో నిందితులు ఆటోలో పారిపోయారు. ఈవిషయమై అందిన ఫిర్యాదుతో సీసీ ఫుటేజీ ద్వారా విచారణ చేపట్టగా వరంగల్‌కు చెందిన నలుగురు పట్టుబడ్డారని ఎస్సై కె.జగదీష్ తెలిపారు. గతంలో పలు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. ఈమేరకు వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఎల్లాస్వామితో పాటు వరంగల్ శివనగర్‌కు చెందిన చిరుపాటి సాలమ్మ, చిరుపాటి ఎల్లమ్మ, తూరుపాటి లక్ష్మి, తూరుపాటి సునీతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.